క్లుప్తంగా...

తల్లి పాల వారోత్సవాల పోస్టర్ విడుదల



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ రూపొందించిన తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ అధికారి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రాంపల్లి దాయరవాసి వేల్పుల పద్మారావుకు ప్రభుత్వం జారీ చేసిన ఎల్‌ఓసీని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్స్ హాస్పిటల్‌లో పద్మారావు చికిత్స చేయించుకునేందుకు అయ్యే రూ.2.50 లక్షల ఖర్చును ప్రభుత్వం భరించేందుకు ఎల్‌ఓసీ ఇస్తున్నట్లు చెప్పారు.

రామలింగేశ్వర స్వామి సేవలో తహసీల్దార్



తహసీల్దార్ అశోక్ కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ రమేష్‌శర్మ

కీసర: శ్రీభవానీ శివదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న అశోక్ కుమార్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు ఆశీర్వచనం అందజేశారు. తహశీల్దార్‌ను ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యుడు రాగుల రమేష్, కీసర ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ ఘనంగా సన్మానించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి నిధులతో వార్డులో సంపూర్ణ రోడ్లు, సంపూర్ణ డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, పట్టణ మాజీ ఉపసర్పంచ్ నర్సింహరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రాజబొల్లారం నాయకులు



మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ నాయకులు శుక్రవారం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. మంత్రి నివాసంలో ఆయనను కలిసి తమ గ్రామాన్ని సందర్శించాలని, గ్రామంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, వ్యాయామశాల, దేవాలయ, కుల సంఘాల భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో గ్రామంలో పర్యటించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు.

రెండు షాపుల్లో చోరీ

ఘట్‌కేసర్: పట్టణంలోని మార్కెట్‌లో రెండు దుకాణాల్లో అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం మార్కెట్‌లోని కృష్ణ ఎంటర్‌ప్రైజెస్ స్టేషనరీ జనరల్ స్టోర్, ఆర్. నర్సింహులు స్టోర్స్‌లో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు గడ్డపార, ఐరన్ రాడ్‌లతో దుకాణాల షెటర్లను పైకిలేపి లోపలికి చొరబడ్డారు. స్టేషనరీ దుకాణంలో నగదు లభించలేదు. మరొక దుకాణంలో రూ.20 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.

సారెప్పుడొస్తారు..?



- సర్కారీ బడికి ఆదరణ పెరిగినా.. పట్టించుకోలేదు
- స్కూళ్లలో కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య 11,107
- ప్రైవేట్ స్కూళ్ల నుంచి చేరిన వారి సంఖ్య 3,895
- జిల్లాలో వెయ్యిమంది టీచర్లకు.. ఉన్నది 857మందే..
- ఇంగ్లిష్ మీడియం ప్రారంభంతో అదనంగా అవసరం
- మరో 200 మంది అవసరమంటున్న విద్యార్థి సంఘాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కరోనా పరిస్థితుల నుంచి ఉపశమనం తర్వాత సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రవేశాలు పెరిగినా.. అందుకు తగ్గట్టు బోధన వసతులు కరువయ్యాయి. టీచర్ల కొరత వేధిస్తోంది. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో.. ఫలితాల్లో ఆ పరిస్థితి స్పష్టమవుతోంది. ముఖ్యంగా బయోలాజికల్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, హిందీ వంటి సబ్జెక్టులకు ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో బోధన అంతంత మాత్రమే సాగుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కలిపి సుమారు 175 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదరణ పెరిగినా..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో కొత్తగా 11,107 మంది విద్యార్థులు చేరారు. ప్రైవేట్ స్కూళ్ల నుంచే 3,895 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారంటే.. ఆదరణ ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. అలాగే, మన ఊరు–మనబడి కార్యక్రమం కింద రూ.70 కోట్ల వ్యయంతో 176 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెలాఖరు వరకు మండలానికి రెండు చొప్పున 30 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మనబడి కింది చేపట్టిన అభివృద్ధి పూర్తయ్యేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. అలాగే, 2021–22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నట్లు విద్యాశాఖ పేర్కొంది. అలాగే, 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 14,757 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలల నుంచి 6,885 మంది ఉన్నారు.

అదనపు టీచర్లు..

మేడ్చల్ జిల్లాలో 515 ప్రభుత్వ పాఠశాల(రెండు ఎయిడెడ్)ల్లో 96,608 మంది విద్యార్థులు చదువుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 14,757 మంది విద్యార్థులు చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెయ్యి మంది టీచర్లు పనిచేయాల్సి ఉన్నా.. ప్రస్తుతం 857 మంది మాత్రమే పని చేస్తుండటంతో.. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఇంగ్లిష్ మీడియం బోధన ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కావడంతో అదనంగా 175 నుంచి 200 మంది టీచర్లు అవసరమని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

విద్యా వలంటీర్ల తొలగింపుతో..

విద్యా వలంటీర్లను మూడేళ్ల క్రితం తొలగించిన ప్రభుత్వం.. వీరిని నియమించాలని కోరుతున్న విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను కూడా పెడచెవిన పెడుతోంది. పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా.. జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అప్పటి వరకు విద్యా వంటీర్లను నియమించాలని కోరుతున్నాయి. గతంలో జిల్లాలో 225 మందికి పైగా విద్యా వలంటీర్లు పని చేసినట్లు తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖ వర్గాలు మాత్రం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని పేర్కొంటున్నాయి. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేసినట్లు కూడా చెబుతోంది.

అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాలు

- ప్రతి కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమా వేశంలో కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన ముందస్తు ప్రణాళికతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. శాసనసభ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, పోలింగ్ కేంద్రాల షిఫ్టింగ్, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, నూతన ఓటరు నమోదు, ఎన్నికల సందర్భంగా పొలిటికల్ పార్టీలు పాటించాల్సిన అంశాలపై ఆయన మాట్లాడారు. జిల్లాలో 1350 మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనపు ఓటర్ల కోసం కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల సౌలభ్యానికి కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను షిఫ్ట్ చేశామని పేర్కొన్నారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న భవనాల్లోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నందున పోలింగ్ కేంద్రం(లొకేషన్) మారే అవకాశాలు ఉంటాయని, ఈ విషయంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అలాగే, పోలింగ్ కేంద్రాలు మారే వివరాలను కూడా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల నాయకులకు తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులు సలహాలు, సూచనలు చేయగా, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించటానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తమ సహకారాన్ని అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి, కీసర ఆర్డీవోలు శ్యామ్‌ప్రకాశ్, రాజేశ్‌కుమార్, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ హయాంలోనే జవహర్‌నగర్ అభివృద్ధి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, కార్పొరేటర్ ఆశాకుమారి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ పాపయ్యనగర్ కాలనీలో కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి ఆధ్వర్యంలో రూ.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించే డ్రైనేజీ పనులను శుక్రవారం మేయర్ కావ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో, మంత్రి మల్లారెడ్డి సహకారంతోనే జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్పొరేషన్‌లో ఎక్కడ చూసినా ప్రగతి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు మెట్టు వెంకన్న, నాయకులు సత్యనారాయణ, అంబాజీ, యాకయ్య, నర్సింహచారి, రవి, లక్ష్మీ, రజిత, స్రవంతి, సుజాత, రాధిక, దేవి, ధనలక్ష్మీ, మౌనిక, జానమ్మ, లలిత, కాలనీవాసులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



ఘట్‌కేసర్‌లో నిరసన చేపట్టిన ఏఐవైఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ, విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమని, తొమ్మిదేళ్లు గడుస్తున్నా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి సల్మాన్ బైగ, సత్యప్రసాద్, మండల అధ్యక్షుడు బాబు, కార్యదర్శి శివ, నేతలు మహేందర్, మురళీ, జహంగీర్, కిరణ్, సచిన్, దీప్తి, నర్మద, రవళి, కుమారి పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి



ఘట్‌కేసర్‌లో సీసీ ఫ్లోరింగ్ పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని పలు ఆలయాల అభివృద్ధికి మల్లారెడ్డి ట్రస్ట్ ముందుకొచ్చింది. పట్టణంలోని మారుతీనగర్ పోచమ్మ ఆలయం ఆవరణలో సీసీ, ఫ్లోరింగ్ పనులు, కొండాపూర్‌లోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాల సుందరీకరణ పనులకు మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి ట్రస్ట్ నిధులు రూ.5 లక్షల నగదు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, సంజీవముదిరాజ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, సుధాకర్, పోచయ్యముదిరాజ్, నరేశ్‌ముదిరాజ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఆల్బెంజదోల్ మాత్రలు పంపిణీ చేసిన చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బాబురెడ్డినగర్‌లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను చైర్మన్ చంద్రారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బిల్లీ బేర్స్ హొవర్డ్ ప్రీ స్కూల్ పిల్లలకు నులిపురుగుల నివారణ ట్యాబ్లెట్లను వైద్యుల పర్యవేక్షణలో ఇచ్చామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్స్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న దాతలు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

కీసర: రాంపల్లి దాయరలో తూముకుంట నర్సింహ ఇటీవల అకాల మరణం చెందాడు. మృతుడి కుటుంబానికి 1వ వార్డు సభ్యుడు కందాడి శ్రీకాంత్‌రెడ్డి రూ.10 వేలు, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుడు కందాడి వెంకట్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాంపల్లి దాయర మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు ముక్క మహేందర్, బొక్క విజయ, దూసరి సాయిగౌడ్, గంగి ఆంజనేయులు, చొక్కారపురం రాజు, మామిడి యాదగిరి, గంగి నర్సింహ, బిట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో నూతన మద్యం పాలసీ షురూ..

నాగోలు: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా 2023–2025 సంవత్సరాలకు గాను నూతన మద్యం పాలసీ విధాన ప్రక్రియను ఆ జిల్లా మద్య నిషేధం, అబ్కారీ శాఖ మేడ్చల్, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ యూనిట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్స్ కే.విజయ్ కుమార్ డి.అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం నాగోలు అనంతుల రాంరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మేడ్చల్ యూనిట్ 114 దుకాణాలకు మల్కాజిగిరి, యూనిట్ 88 దుకాణాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు వారు తెలిపారు. నూతన మద్యం పాలసీ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు వారు తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని వారు తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను 21వ తేదీన ఉదయం 11 గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ద్వారా దుకాణదారులను ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 4 నుంచి 18 తేదీ వరకు అన్ని పని దినాల్లో నాగోలులోని అనంతుల రామ్‌రెడ్డి గార్డెన్స్‌లో ఎటువంటి ఎక్సైజ్ శాఖ కేసులు లేకుండా ఆసక్తి ఉన్నవారు రూ.2 లక్షల చొప్పున ఎక్సైజ్ శాఖ పేరిట డీడీ లేక చలాన్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, పాన్ కార్డు, సెల్ఫ్ అటెస్టెడ్‌తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి మేడ్చల్ ఏఈఎస్‌లు ముకుందారెడ్డి, మాధవయ్య, ఉప్పల్ సర్కిల్ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, సీఐలు, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హష్ ఆయిల్ విక్రయిత అరెస్టు

రూ. 42 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అల్వాల్: నిషేధిత మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.42 లక్షల విలువచేసే మత్తు పదార్థాలను రాచకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాచకొండ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ డీఎస్. చౌహాన్ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన అజ్మీర సూర్య(34) వరంగల్ జిల్లాకు చెందిన రాము, ఒడిషాకు చెందిన లక్ష్మణ్ ఒడిషా నుంచి నిషేధిత హష్ ఆయిల్‌ను తీసుకువచ్చి వరంగల్‌లో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు సూర్యను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రూ.42 లక్షల విలువైన హష్ ఆయిల్‌తో పాటు 2 సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈకి వినతి



ఘట్‌కేసర్‌లో వినతి పత్రం అందజేస్తున్న ఉపేందర్ తదితరులు

ఘట్‌కేసర్: అన్నోజీగూడ వికలాంగుల భవన సముదాయంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఫిజికల్లి చాలెంజ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ ఏఈ సతీశ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ఇద్దరికి ఇప్పటికే షాక్ తగిలిందని, భవనం గోడలకు సైతం ఎర్త్ వస్తోందని, పిల్లలకు ప్రాణాపాయం ఉందని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో బాలనర్సయ్య, జాను పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్



నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో వజ్రేశ్‌యాదవ్, మండల అధ్యక్షుడు వినోద్

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వజ్రేశ్‌యాదవ్ అన్నారు. చౌదరిగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నియామకాలను శుక్రవారం చేపట్టారు. చౌదరిగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ధన్‌రాజ్, కొర్రెముల్ పాండురంగా, అవుషాపూర్ కృష్ణ, మాధారం దిలీప్, ఘనాపూర్ దేవిసింగ్, మర్పల్లిగూడ షఫీ, ఎదులాబాద్ బాలకృష్ణ, వెంకటాపూర్ సాయికుమార్, ప్రతాపసింగారం భానుప్రకాశ్, కాచవానిసింగారం రఘు, అంకుషాపూర్ నితీశ్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండల యూత్ ఉపాధ్యక్షుడిగా అజయ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కార్యదర్శిగా రాజీవ్, సంయుక్త కార్యదర్శిగా శ్రవణ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శివకుమార్‌ను నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, ప్రధాన కార్యదర్శి బాబురావు, కార్పొరేటర్ అజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అభ్యసించాలి



అనురాగ్ యూనివర్సిటీ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథితో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్: రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను విద్యార్థులు అభ్యసించాలని ఎలిట్సేలర్ సీఈఓ సాయికృష్ణ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో కృత్రిమ మేధస్సు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, యాప్, వెబ్ అభివృద్ధి వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి పథం వైపు పయనించాలన్నారు. హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి యాప్ అభివృద్ధి, వెబ్ అభివృద్ధి పద్ధతులపై వివరించారు. ప్రదీప్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



స్వచ్ఛ్ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రోజురోజుకూ పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో మనిషి జీవితం ప్రమాదంలో పడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ్ సర్వేక్షణ ఓటింగ్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మనం పీల్చే గాలి, తినే తిండి, తాగే నీటిలో కూడా ప్లాస్టిక్ మైక్రోప్లాస్టిక్ అవశేషాలు ఉంటున్నాయన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదన్నారు. స్వచ్ఛ్ మున్సిపాలిటీకి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు నాయుడు, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌ఓ)లతో చైర్మన్ చంద్రారెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు, ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం కోసం ప్రత్యేక క్యాంపుల గురించి చర్చించారు. అదేవిధంగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో నాగారంను ప్రథమ స్థానంలో నిలపాలని, అందుకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ సిబ్బందికి చైర్మన్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం



నగదు అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీకి చెందిన తూముకుంట నరసమ్మ ముత్యాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల పక్షవాతం రావడంతో చైర్మన్ చంద్రారెడ్డి స్పందించి రూ. 10 వేల నగదు అందజేశారు.